# ఉండమ్మా బొట్టు పెడతా!

## పోట్లూరు సుబ్రహ్మణ్యం

కృష్ణా ఎక్స్‌ప్రెస్ కీచుమంటూ ఆగింది నెల్లూరు రైల్వే స్టేషన్లో. జనం హడావుడిగా ఎక్కుతున్నారు. శ్రీరామ్, వనజ అందరితోబాటు రైలెక్కారు. వీళ్ల సీట్లో కూర్చోబోతుండగా 'ఖస్సు'మని తుమ్మింది ఎదురు సీట్లో కూర్చొని ఉన్న ఓ మధ్య వయసు స్త్రీ. అక్కడున్న వాళ్లంతా పెద్దగా నవ్వారు. వనజ- ఆమె ఏమనుకొంటుందేమోనని నవ్వు బయటికి రాకుండా ముసిముసిగా నవ్వుకొంది.

తాము కూర్చుంటామో, కూర్చోమోనని అనుమానంగా గమనిస్తున్న అందరి అంచనాలను తల్లక్రిందులు చేస్తూ, వనజ, శ్రీరామ్ కూర్చున్నారు. ఒక తుమ్ము కాదు కదా, 'ఖస్సు...ఖస్సు'మని అదేపనిగా తుమ్మసాగింది ఆ స్త్రీ. పక్కనే ఉన్నాడు ఆమె భర్త. అతనికి యాభై ఏళ్లుంటాయి. తల అక్కడక్కడా నెరిసి ఉంది.

“మాదిదా బెంగుళూరప్పా. నా పేరుదా భైరప్ప. ఇది నా భార్య చూడామణి. మణికిదా చాలాకాలం నుంచీ ముక్కుపొడుం అలవాటప్పా. ఎంత చేసినా అది ఆ అలవాటు మానుకోలేకపోతోంది” సంజాయిషీ ఇచ్చుకొన్నట్లు చెప్పాడు వచ్చీరాని తెలుగులో.

“ఏం ఫరవాలేదు. అది తప్పూ కాదు, విచిత్రమూ కాదు” అన్నాడు శ్రీరామ్.

“ఆ...!” అన్నాడు భైరప్పా ఆశ్చర్యంగా.

“అవునండీ. మెక్సికన్స్ లో పదహారవ శతాబ్దంలోనే సెవెన్టీ పర్సెంటు ముక్కుపొడుం పీల్చేవాళ్లు ఉండేవారండి. పద్దెనిమిదవ శతాబ్దంలో ఇంగ్లండు దేశంలోని ప్రజలు దాదాపు అందరూ ముక్కుపొడుం పీల్చేవారట. ఎందుకో తెలుసాండి. అక్కడ ప్లేగు వ్యాధి నుండి తమను అది కాపాడుతుందని వాళ్ల నమ్మకం”.

“అహహా... ఎంత బాగా చెప్పారండి” మెచ్చుకున్నాడు భైరప్ప. శ్రీరామ్ మాటల్ని కన్నడంలో ఆమెకి అనువదించి చెప్పాడు. ఆమె కూడా శ్రీరామ్‌ని మెచ్చుకోలుగా చూసింది.

“అసలు ముక్కుపొడుం పీల్చేవాళ్లు చాలా మేధావులండీ. ఐరోపాలోని మూడవ జార్జి, నాలుగవ జార్జిలకు ఎప్పుడూ వాళ్లవెంట నగిషీలు చెక్కిన బంగారు భరిణెల నిండా ముక్కుపొడి ఉండేదండీ”.

ఈ మాటలు మళ్లీ భైరప్ప ట్రాన్స్‌లేట్ చేసి చూడామణికి గర్వంగా చెప్పాడు. చూడామణికి, శ్రీరామ్‌పట్ల ఎనలేని గౌరవమేర్పడిపోయింది. ముక్కుపొడుం పీల్చడం, తద్వారా తుమ్మడం ఇతరులకు నవ్వు తెప్పిస్తుందని, ఇతరుల ముందు చులకనయిపోతానని భావించిన ఆమె శ్రీరామ్ మాటలకు ఎంతో ఆనందించింది. ముక్కుపొడుం భరిణ మూత తీసి పట్టుకొని చేయి పొడవుగా చాచి భరిణ శ్రీరామ్ ముందుంచింది, 'తీసుకోండి' అన్నట్లు.

'చచ్చాం రా బాబో...' అనుకొన్న శ్రీరామ్ వద్దన్నట్లు చేత్తో సైగచేసాడు. వనజ వచ్చే నవ్వును అతికష్టంమీద ఆపుకొంది.

కడుపు నింపుకొన్న కోడె త్రాచులా కృష్ణా ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా నెల్లూరు ప్లాటుఫారం నుండి కదిలింది. రైలు స్టేషను వదిలిందో లేదో భైరప్ప కళ్లు మూతలు పడ్డాయి. పక్కనే ఉన్న భార్య భుజంమీదికి వాలిపోయాడు. తరువాత చిన్నగా పిల్లికూతలా ప్రారంభమైన అతని గురక రైలువేగం పెరిగేకొద్దీ అంతకంతకూ ఎక్కువ కాసాగింది.

నోరు తెరచి కంపార్టుమెంటులోని గాలినంత తనే పీలుస్తూ, తిరిగి గాలిని స్టీము ఇంజెనులా భయంకరమైన శబ్దంతో వదలసాగాడు.

“తుమ్ముల బాధ తగ్గిందనుకొంటే ఈ గురక బాధ ఎక్కువయింది గదండీ” అంది వనజ. శ్రీరామ్ చిరునవ్వు నవ్వాడు. సమయం గడచిపోతూ ఉంది. అందరూ రైలు శబ్దంకంటే భయంకరమైన ఈ గురక శబ్దం గురించి చర్చించుకొంటుండగా రైలు బిట్రకుంట స్టేషన్ని సమీపిస్తూ స్లో అయింది. దాంతో గురక వేగం కూడా తగ్గింది. రైలు స్టేషన్లో ఆగింది. గురక ఆగిపోయింది. ఉలిక్కిపడి కళ్లు తెరచి సరిగ్గా కూర్చున్నాడు భైరప్ప. వెంటనే చూడామణి బొళ్లోంచి వెంటనే భరిణ తీసి అందులోని ముక్కుపొడుం రెండువైపులా ముక్కుకు దట్టించింది. వెంటనే 'ఖస్సు... ఖస్సు...' మంటూ తుమ్ములు మొదలయ్యాయి.

“సారీ అప్పా. నేను మీ అందరికీ డిస్టర్బెన్సు కలిగించాను కదూ” అన్నాడు భైరప్ప సిగ్గు పడుతూ.

“నో... నో... మీవల్ల మాకేమీ డిస్టర్బన్సు లేదండీ. మహా మహా మేధావులంతా గురకగాళ్లండీ. అలెగ్జాండర్ ది గ్రేట్, జూలియస్ సీజర్, జార్జి వాషింగ్టన్, వాళ్లంతా గొప్ప గురకగాళ్లని చారిత్రకాధారాలున్నాయి” అన్నాడు శ్రీరామ్.

భైరప్ప ముఖం ఆనందంతో వెలిగిపోయింది. నవ్వుతూ ముందుకు వంగి శ్రీరామ్ వైపు చేయి చాచి షేక్ హాండిచ్చాడు.

“నువ్వుదా నాకు నిజంగా నచ్చావప్పా. ఇంతకాలం మా అలవాట్లకు సిగ్గుపడేవాళ్లం. ఆ బాధ ఇప్పుడు తీరిపోయిందప్పా” సంతోషంగా అన్నాడు భైరప్ప. బెంగుళూరు నుంచి తిరుపతి వచ్చి, స్వామి దర్శనం చేసుకొన్నారని, హైదరాబాదులో ఉన్న కూతురు, అల్లుడ్ని చూడడానికి వెళుతున్నా మంటూ ఎంతో ఆప్యాయంగా తన కుటుంబ విషయాలన్నీ చెప్పాడు భైరప్ప.

మొదటి వరుస తుమ్ములుఆగిపోయిన తరువాత భార్యతో తన గురకను శ్రీరామ్ ఎలా మెచ్చుకున్నదీ కన్నడంలో చెప్పి, బిగ్గరగా నవ్వసాగాడు. చూడామణి కూడా శ్రీరామ్ వైపు మెచ్చుకోలుగా చూసింది.

చూడామణి రెండోసారి నశ్యం పట్టించే అవకాశం ఇవ్వకుండానే రైలు ముందుకు కదిలింది. భైరప్ప సడన్ బ్రేకు వేసినట్లు టక్కున ఆగిపోయాడు. కళ్లు మూతలుపడిపోయాయి. భార్య భుజంమీద తలవాల్చి గురక మొదలుపెట్టాడు రైలు స్పీడుకు అనుగుణంగా.



ఇలా రైలు ఆగినప్పుడు చూడామణి నశ్యం పట్టించి తుమ్మడం, అది బయలుదేరగానే భైరప్పనిద్రలోకి జారిపోయి గురకలు పెట్టడం, అదిచూసి పాసెంజర్లు నవ్వు కోవడం జరిగింది విజయవాడ స్టేషన్లో రైలు ఆగానే “వెళ్లొస్తా”మని చెప్పి లేచారు శ్రీరామ్, వనజ. ఉండమన్నట్లు సైగచేసింది చూడామణి. బ్యాగు జిప్‌లాగి కుంకుమభరిణ తీసింది. తరువాత తనూ లేచి వనజ నుదుట కుంకుమ బొట్టు పెట్టి, ఆప్యాయంగా కౌగలించుకుంది. తరువాత కన్నడంలో భర్త భైరప్పతో ఏదో చెప్పింది. శ్రీరామ్, వనజలతో బాటు భైరప్ప కూడా ప్లాటుఫారం మీదికి దిగాడు. “మిమ్మల్ని మా కూతురు, అల్లుడుగా భావించామప్పా. అందుకే కలకాలం చల్లగా ఉండమని కుంకుమబొట్టు పెట్టి ఆశీర్వదించింది చూడామణి” భైరప్పకళ్లు ఆనం దంతో చెమర్చాయి. శ్రీరామ్, వనజ మాటలు రాక అలాగే నిలబడిపోయారు. రైలు కూతేసింది. భైరప్ప రైలెక్కాడు. రైలు బయలుదేరింది. సీట్లో కూర్చున్న భైరప్ప కళ్లు మూతలు పడ్డాయి. గురక మొదలయింది.